క్లుప్తంగా

కరోనా లక్షణాలుంటే కోవిడ్ పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సూరారం కాలనీ యూపీహెచ్ఎస్‌లో 21 మందికి పరీక్షలు చేశారు. అందులో అందరికి నెగిటివ్ రిపోర్ట్‌లు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పి తదితర లక్షణాలుంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలని అధికారులు కోరుతున్నారు.

5న త్రోబాల్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు

కూకట్‌పల్లి: ఛత్తీస్‌ఘడ్‌లో ఈనెల 28 నుంచి 30వ జరిగే సబ్ జూనియర్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొనే జట్లకు పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర త్రోబాల్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ హైదరాబాద్ గండిపేట్ ఎక్స్ రోడ్ దగ్గరలోని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సబ్ జూనియర్ విభాగంలో పాల్గొనే బాల బాలికలు 1 ఏప్రిల్ 2007 నాటికి జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో ఎంపిక పోటీల్లో పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు కోరారు. మెహదీపట్నం నుంచి 288 బీ,డీ, కే, ఆర్ ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు జమీల్ 99499 70122, అరుణ్‌గౌడ్ 70325 86771లో సంప్రదించాలని కోరారు.

'మనూ'లో సాంస్కృతిక కార్యాచరణ కేంద్రం ఏర్పాటు

రాయదుర్గం: మనూలో పాత క్యాంటీన్ భవనంలో విశ్వవిద్యాలయం విద్యార్థుల కోసం సాంస్కృతిక కార్యాచరణ కేంద్రాన్ని ఈనెల 6వ తేదీన వీసీ ఐనుల్ హసన్ ప్రారంభించనున్నారు .అనంతరం ఉదయం 10.30 గంటలకు 'కథ రాయడం ఎలా' అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తారు. వర్క్‌షాప్‌ను డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర

బాలానగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం బీజేపీ నాయకులు ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌బీఎస్‌నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేశారు. కాలనీవాసులు అర్హులైన వారికి పెన్షన్లు రావటం లేదన్నారు. వీధి దీపాలు వెలగటం లేదని వారి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

డ్యూటీకి వెళ్లొచ్చే సరికి..

జీడిమెట్ల: డ్యూటీకి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలుపడి నాలుగు తులాల బంగారు దోచుకెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎం పవన్ వివరాల ప్రకారం.. చింతల్ శివనగర్‌లో ఉండే చిలక భిక్షాలు ఓ ఫార్మా పరిశ్రమలో ఉద్యోగి. భిక్షాలు భార్య పుట్టింటికి వెళ్లడంతో ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి నైట్‌డ్యూటీకి వెళ్లాడు. శుక్రవారం ఉదయం డ్యూటీ నుంచి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తెరచి ఉంది. అందులో ఉన్న నాలుగు తులాల బంగారం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ ఏం కూలుస్తారు?

నిర్మాణాల కూల్చివేతను అడ్డుకున్న స్థానికులు



ఇళ్లను కూల్చివేసేందుకు జేసీబీతో వచ్చిన రెవెన్యూ సిబ్బందిని అడ్డుకుంటున్న స్థానికులు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాలను కూల్చివేసేందుకు రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగగా కోపోద్రిక్తులైన స్థానికులు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. నాలుగురోజుల క్రితం దేవేందర్‌నగర్‌లోని 70 ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తాజాగా శుక్రవారం సర్వే నం.342లో మరిన్నీ నిర్మాణాలు కూల్చివేసేందుకు రెవెన్యూ సిబ్బంది జేసీబీతో రాగా అక్కడ ఇళ్లు కోల్పోయిన వారికి పుండుమీద కారం చల్లినట్లు అయ్యింది.

◆ ఇప్పటికే తమ ఇళ్లను రెండుసార్లు కూల్చివేశారు. ఇంకా ఇక్కడికి ఎందుకు వచ్చారు? మళ్లీ ఏం కూలుస్తారు? అంటూ స్థానికులు సిబ్బందిని నిలదీశారు. ఇటీవల కూల్చివేసిన స్థానంలో వేరే నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు రావడంతో వాటిని అడ్డుకునేందుకు మాత్రమే వచ్చామని రెవెన్యూ సిబ్బంది వారికి నచ్చజెప్పుతూ మరో వైపు కూల్చివేతలకు దూకుడు ప్రదర్శించారు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఒకవైపు బడాబాబులు ఎకరాలకొద్ది కబ్జాలు చేస్తుంటే వారిని పక్కనపెట్టి తమపై దౌర్జన్యం ఏమిటని ప్రశ్నించారు.

◆ **అధికారుల పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటా..**

దేవేందర్‌నగర్ సర్వే నం.342లోని మంజూర్‌నగర్‌లో పిల్లర్లను కూల్చివేసేందుకు రెవెన్యూ సిబ్బంది రాగా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఇళ్లు ఎన్నిసార్లు కూల్చివేస్తారంటూ ఓ మహిళ సిబ్బందితో వాగ్వాదానికి దిగింది. ఒకవేళ మిగిలిన ఇళ్లను కూల్చివేస్తే అధికారుల పేర్లు రాసి అత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది.



ఇటీవల కూల్చివేసిన తమ ఇళ్లను చూపుతున్న స్థానికులు

భేటీ.. పార్టీ వర్గాల్లో ఆసక్తి

ప్రాధాన్యతను సంతరించుకున్న కేఎం ప్రతాప్, శంభీపూర్ రాజు భేటీ

దుండిగల్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుల భేటీ ఆ పార్టీ వర్గాల్లో ఆసక్తి రేపింది. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే వివేకానంద్‌కు స్వయాన బాబాయి అయిన కేఎం ప్రతాప్ కుమారుడు వరుసకు సోదరుడైన కేపీ విశాల్‌గౌడ్ బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే.

◆ స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్ వ్యవహారశైలి నచ్చకే పార్టీని వీడి బీఎస్పీలో చేరుతున్నట్లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరి కుండ బద్దలు కొట్టాడు. అయితే సదరు సమావేశంలో ప్రతాప్ పాల్గొనలేదు. దీంతో ప్రతాప్ సైతం పార్టీని వీడనున్నారా.. అన్న చర్చ ఆ పార్టీలో జోరుగా సాగింది.

◆ ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఐడీపీఎల్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొనగా ఊహించని రీతిలో ప్రతాప్ సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

◆ కార్యక్రమం ముగిసిన అనంతరం అక్కడి నుంచి ఇరువురు నేరుగా కేఎం ప్రతాప్ నివాసానికి చేరుకున్నారు. విశాల్ పార్టీ వీడుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో వీరిద్దరు భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇంటికి వచ్చిన రాజును ప్రతాప్ సతీమణి అయిన మాజీ కార్పొరేటర్ కూన పద్మ హారతి ఇచ్చి శాలువాతో సత్కరించారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సత్కరిస్తున్న కేఎం ప్రతాప్ దంపతులు

◆ ఇటీవల శాసనమండలి విప్‌గా నియమితులు కావడంతోనే మర్యాదపూర్వకంగా కలిశారని పార్టీ వర్గాలు చెప్తున్నా వీరిద్దరి మధ్య ఎలాంటి అంశాలు చర్చకు వచ్చాయనేది తెలియాల్సి ఉంది. ప్రతాప్ పార్టీని వీడుతారా.. లేదా వీరి మధ్య జరిగిన చర్చలు సఫలీకృతం కావడంతో పార్టీలోనే కొనసాగుతారా? అన్న ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

పోస్టల్ శాఖ సేవలపై అవగాహన పెంచుకోవాలి



పోస్ట్ ఆఫీస్‌లో మొదటి ఖాతాను తీసుకుంటున్న నగేష్

సుభాష్‌నగర్: ప్రజలకు ఎంతో ఉపయోగపడే పోస్టల్ శాఖ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సౌత్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ సికింద్రాబాద్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని బాలయ్యనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కైలాస్‌హిల్స్ పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్‌ను శుక్రవారం అయన పీఆర్‌ఐ బేగంపేట్ జీవీ రామారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ... కొన్ని సంవత్సరాల నుంచి సేవలందిస్తున్న పోస్టల్ శాఖా ద్వారా పేద, మధ్య తరగతి నుంచి మొదలుకొని సంపన్న వర్గాల వరకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఈ శాఖ ద్వారా చిన్న మొత్తాల పొదుపు ఆర్‌డీ సేవింగ్ అకౌంట్ సుఖన్య యోజన పథకం పీపీఎం మనీ ఆర్డర్ రిజిష్టర్ స్పీడ్‌పోస్ట్ పార్శిల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధార్‌కార్డ్ నమోదు ఇన్సూరెన్స్ సరీ్వసుల సేవలను అందిస్తుందని తెలిపారు. కొత్తగా ప్రారంభమైన పోస్టాఫీసులో స్థానికంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఖాతాలు తెరచి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలయ్యనగర్ అధ్యక్షుడు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పుష్కర బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: గోదావరి హోమ్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు.



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న వేదపండితులు

నిజమైన ఉద్యమకారులకు నేడు గుర్తింపు లేదు



కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులకు నేడు గుర్తింపు లేకుండా పోయిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉద్యమకారుల చరిత్ర పుస్తకావిష్కరణతో ఆటు ఫొటో ప్రదర్శనను ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో అశోక్‌రెడ్డి ఉద్యమకారుల చరిత్రను ఒక పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణలో ఎక్కడ కూడా నిర్వహించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఉద్యమకారుల చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించి ఉద్యమకారులను ఒకే తాటిపై తీసుకువచ్చి పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం ఉద్యమం సమయంలో చేపట్టిన ఆందోళనకారుల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులకు న్యాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ చీమ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, జగద్గిరిగుట్ట జేఏసీ నాయకుడు శివరాత్రి యాదగిరి, కుత్బుల్లాపూర్ మండల జేఏసీ కన్వీనర్ ఎల్లారెడ్డి, కన్వీనర్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకుడు సంపత్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది'



ఐడీపీఎల్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సీనియర్ల వేధింపులతో మృతి చెందిన గిరిజన వైద్య విద్యార్థిని ప్రీతి నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐడీపీఎల్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్‌తో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళలపై దాడులు, ఆత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. ఓ వైద్య విద్యార్థి సైతం ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ప్రీతినాయక్ ది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని అన్నారు. రాష్ట్రంలో నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిందని పేర్కొన్నారు. మహిళలపై అత్యాచారాల శాతం 23 శాతంగా నమోదయ్యిందని తెలిపారు. ఆరేళ్ల చిన్నారిపై అఘాయిత్యం జరిగినా స్పందించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వ ఉందని అసహనం వ్యక్తం చేశారు.

◆ లక్షలాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, ఆత్యాచారాల ఘటనలును నిరోధించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ప్రీతి నాయక్ హంతకుడు రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ సమీప బంధువు కావడంతోనే కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితమై రాష్ట్ర పరిపాలనను గాలికొదిలేశారని ఆరోపించారు. ప్రీతి నాయక్ హంతకులకు శిక్ష పడేంత వరకు వదిలి పెట్టే ప్రసక్తే లేదని శ్రీశైలంగౌడ్ స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగ్యర్థి, రాయల్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచాలి

దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ



బిల్ కలెక్టర్లతో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: ఆస్తిపన్ను వసూళ్ల విషయంలో అధికారులు, సిబ్బంది వేగం పెంచాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయటమే లక్ష్యంగా అందరు పనిచేయాలని సూచించారు. ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో రెవెన్యూ మేళా నిర్వహించాలన్నారు. అందులో వచ్చిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఆన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్ పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం నిర్వహించే అన్ని షాపుల యజమానులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

కుక్కలతో జాగ్రత్త..

కుక్క కాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిల్లలు, వారి తల్లిదండ్రులకు వివరించాలని కమిషనర్ సత్యనారాయణ కోరారు. మెప్మా (మహిళా స్వయం సహాయక సంఘాలు) ద్వారా ఇంటింటికీ కరపత్రాల పంపిణీ, వీధి కుక్కలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీధి కుక్కల నివారణ చర్యల్లో భాగంగా బ్లూ క్రాస్ సొసైటీ వారితో ఒప్పందం చేసుకున్నామన్నారు. వారు వీధి కుక్కలను తీసుకెళ్లి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసి యాంటీ రేబీస్ టీకా వేసి వదిలేస్తారన్నారు. ఎండాకాలంలో కుక్కలు డీహైడ్రైషన్‌కు గురై కుక్కలు వింతగా ప్రవర్తిస్తాయని తెలిపారు. వాటికి కావాల్సిన తాగునీరు, ఆహారాన్ని పిల్లలు తిరగని ప్రదేశాల్లో అందించాలని సూచించారు. మెప్మా జిల్లా అధికారి అనిల్, కమ్యూనిటీ ఆర్గనైజర్ మంజుల, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలు చేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌లోని వాజ్‌పేయి నగర్‌లో శుక్రవారం జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు కట్టా కుమార్ ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొని శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డి, జిల్లాప్రధానకార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు పత్తి సతీష్, పులి బలరామ్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాపార పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

బాలానగర్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో నిర్వహించే వెండర్స్ ప్రోగ్రామ్స్‌కు హాజరై వ్యాపార పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని బాలానగర్ ఎంఎస్‌ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం బాలానగర్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో రెండు రోజుల వెండర్స్ ప్రోగ్రామ్ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ... ముద్ర లోన్స్ ఉదయ రిజిస్ట్రేషన్స్, ఎంఎస్‌ఎంఈ స్కీమ్స్, రాయితీలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ డిప్యూటీ మేనేజర్ నాగార్జునరావు, మేనేజర్ బిశ్వాస్, బీఈఎల్ మేనేజర్ వి.ప్రభాకర్‌రావు, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ ఠాణా ఏర్పాటుకు స్థలం పరిశీలన



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీలో తాత్కాలిక పోలీస్‌స్టేషన్ కోసం 6వ ఫేజులోని మోడల్ మార్కెట్ వద్ద కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఏసీపీ చంద్రశేఖర్‌రావు, సీఐ కిషన్‌లతో ఆ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తాత్కాలిక పోలీస్‌స్టేషన్ కొరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అత్యాధునిక సదుపాయాలతో నూతన పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్లపై సబ్సిడీలను తొలగించడం సరికాదు

రంగారెడ్డినగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం పట్టడం లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తాలో గ్యాస్‌ధరల పెంపును నిరసిస్తూ రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు కేంద్ర ప్రభుత్వ తీరును తూర్పారబట్టారు. కేంద్రంలో అధికారం చేపట్టిన 9 ఏళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం దాదాపు గ్యాస్ సిలిండర్ ధరను రెండింతలు పెంచారన్నారు. ఇలా పెంచుకుంటూ పోతే సామాన్యులు కట్టెల పొయ్యిలపై వంటలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోందన్నారు. గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీలను తొలగించడం సరికాదన్నారు. ఈ విషయమై సీఎం కేసీఆర్ నేతృత్వంలో జాతీయస్థాయిలో ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను తెలియజేశారు. బీఆర్ఎస్ పార్టీ ధర్నా నేపథ్యంలో ఐడీపీఎల్ చౌరస్తాలో భారీగా ట్రాఫిక్ జామ్ కాగా ట్రాఫిక్ పోలీసులు ఆందోళన అనంతరం చక్కదిద్దారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కె.ఎం.ప్రతాప్, దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ గరిశ నరేందర్‌రాజు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగరాజుయాదవ్, కార్పొరేటర్లు విజయశేఖర్‌గౌడ్, రావుల శేషగిరి, రషీదా బేగం,డివిజన్ల అధ్యక్షులు ఎర్వా శంకరయ్య, విజయ్‌రామ్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



ఐడీపీఎల్ చౌరస్తాలో చేపట్టిన రాస్తారోకోలో పాల్గొన్న ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

ఆస్తిపన్ను ఎక్కడా పెంచలేదు

కమిషనర్ రామకృష్ణారావు



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు ఇష్టానుసారంగా పెంచారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అపార్ట్‌మెంట్లలోని 3, 4, 5 అంతస్తుల ఫ్లాట్ల యజమానులకు ఆస్తి పన్ను రెండింతలు వేసి వసూలు చేస్తున్నారనే ప్రజల ఆందోళల విషయంపై బాచుపల్లి, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాలకు ఒకే పన్ను విధానాన్ని అమలు చేయకపోవడం, ఆస్తి పన్ను విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావుతో 'సాక్షి'ఇంటర్వ్యూ.

ప్రశ్న: నిజాంపేట్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్ను రెండింతలు పెంచారన్న ఆరోపణలపై మీ సమాధానం..?

జవాబు: ఆస్తి పన్ను మేము ఎక్కడ కూడా పెంచడం లేదు. కేవలం సవరణ మాత్రమే చేస్తున్నాం. పెంచే అధికారం మాకు లేదు అలాంటి నిర్ణయం ఏదైన జరగాలంటే ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రశ్న: పన్నులు ఏ ప్రతిపాధికన నిర్ణయిస్తున్నారు?

జవాబు: క్షేత్ర స్థాయిలో ఉన్న నిర్మాణాలు, స్థలం విస్తీర్ణాన్ని బట్టి పన్నులు నిర్ణయిస్తాం. అందులో అధికారులు ప్రత్యేకంగా చేసేది ఏమి ఉండదు.

ప్రశ్న: 2019 నవంబర్ 2 కంటే ముందు భవనాలకు, 2019 డిసెంబర్ తరువాత పూర్తి అయిన నిర్మాణాలకు ఏలాంటి పన్నులు, పెనాల్టీలు వసూలు చేస్తున్నారు?

జవాబు: 2019 కంటే ముందు పూర్తి అయిన నిర్మాణాలకు జీ ప్లస్ 2 అంతస్తుల వరకు సాధారణ పెనాల్టీ వేస్తున్నాం. 2019 డిసెంబర్ తరువాత పూర్తి అయిన నిర్మాణాలకు 3, 4, 5 అంతస్తుల వరకు 100 శాతం పెనాల్టీ వేస్తున్నాం.

ప్రశ్న: కొన్ని అపార్ట్‌మెంట్లకు మొదటి, రెండో అంతస్తుల వారికి సైతం పెనాల్టీలు వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.?

జవాబు: కేవలం అనుమతి లేని నిర్మాణాలకు మాత్రమే అన్ని అంతస్తుల వారికి పెనాల్టీలు వేస్తున్నాం. అనుమతి ఉన్నవాటికి వేయడం లేదు. ఇలాంటి ఆరోపణలు అవాస్తవం.

ప్రశ్న: ఆన్‌లైన్‌లో దొర్లిన (ఇంటి నంబర్, పేరు, పన్నులో హెచ్చు తగ్గులు)లాంటి తప్పులను సరిదిద్దడంలో సరైన స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు.?

జవాబు: ఏప్రిల్‌లో నోటీసులు జారీ చేస్తాం. అప్పుడు అందులో ఏమైనా తప్పులు ఉంటే 60 రోజుల వరకు మా దృష్టికి తీసుకువస్తే మా స్థాయిలోనే వెంటనే సరిదిద్దుతాం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ మేళా కూడా కొనసాగుతోంది. ఇందులో మా దృష్టికి తీసుకువచ్చిన వాటిని సవరిస్తాం.

ప్రశ్న: నిజాంపేట్ కార్పొరేషన్‌లోని మూడు ప్రాంతాలకు పన్ను విధానం తేడా ఉంది కదా? ఒకే పన్ను విధానం అమలు చేయడం సాధ్యం కాదా?

జవాబు: బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్ ప్రాంతాల్లోని రెసిడెన్షియల్ నిర్మాణాలకు విధించే పన్నులో తేడాలు ఉన్నాయి. ప్రగతినగర్‌కు 0.12 పైసలు, బాచుపల్లికి 25 పైసలు, నిజాంపేట్‌లో 15 పైసలు (రూ.100 ఆస్తి విలువలో) అమల్లో ఉంది. అయితే ఈ విషయంపై ప్రభుత్వానికి నివేధించడం జరిగింది. 2023 ఏప్రిల్ నెలలో అన్ని ప్రాంతాలకు ఒకే పన్ను విధానం అమలయ్యే అవకాశాలు ఉన్నాయి.